


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**98**

**(7 ' డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

వివేక భట్టాచార్యగారు "స్వర్గం నుంచి ప్రత్యేక వార్త" అనే వ్యాసం వ్రాశారు. అందులో ఒక పత్రికా విలేఖరి స్వర్గానికి వెళ్ళినట్లు - అక్కడ తనను సారస్వతమూర్తులున్నచోట ఉంచమని కోరినట్లు వ్రాశారు. తర్వాత పత్రికా విలేఖరి కొన్ని విషయాలు సేకరించాడు. 'రవీంద్ర సంగీతం' నారదమునిచేత ప్రాక్టీస్ చేయిస్తున్నారట. ఒక సంవత్సరంలో ఆయన ఉత్తీర్ణుడైతే రవీంద్ర సంగీత శాఖాధ్యక్షునిగా అక్కడ నియమించేందుకు హామీ యిచ్చారట. నారదుడు దానికోసమై తంటాలు పడుతున్నాడుట.

కొద్దికాలం క్రిందనే అక్కడ ప్రాక్పశ్చిమ దేశాలకు చెందిన హిందూ, ముస్లిమ్, సిక్కు, క్రిష్టియన్, యూదు వేదాంత ప్రముఖులు సమావేశమై 'రవీంద్రుని గీతాలలో అన్ని మతాల సారం వుంది గనుక వీటిలో ఏ 'యిజం' యొక్క ప్రస్థావనా లేదు గనుక ఈ సంగీతాన్నే స్వర్గలోకంలో ఆస్థాన సంగీతంగా అంగీకరించాలని ఏకగ్రీవంగా తీర్మానించారట.

అందువల్ల నారద మహామునిని తాత్కాలిక ఆస్థాన గాయకునిగా నియమించారు. ఆయన తన పదవిని ఖాయపరుస్తారో, లేదోనని కంగారు పడుతున్నాడట. టంగులు తెగేటట్లు రవీంద్ర సంగీతం ప్రాక్టీసు చేస్తున్నాడట.

పత్రికా విలేఖరి తర్వాత రవీంద్రుల్ని కలుసుకున్నాడట. ఆయన "నువ్వు పత్రికా విలేఖరివా?" అని ప్రశ్నించారట.

"విలేఖరినేకాదు. ఇంగ్లీషు, బెంగాలీ, ఉరుదు, హిందీ భాషల్లో పుస్తకాలు కూడా వ్రాశాను" అన్నాడుట విలేఖరి.

"అది సరేగానీ, నువ్వు నా పుస్తకాలను గురించి విమర్శ రాసేముందు వాటి నెప్పుడైనా చదివావా?" అని గురుదేవులు ప్రశ్నించారట. పత్రికా విలేఖరి వెంటనే జవాబు చెప్పలేకపోయాడట. కారణం? తనేమీ చదవలేదని అతని మనస్సులో అతడు చెప్పుకుని తలవంచుకున్నాడట. తర్వాత గురుదేవులు పత్రికా విలేఖరికి పచ్చి ద్రాక్ష కొన్ని తీగలనుంచి త్రుంచి ఇచ్చారట. అక్కడ కూడా తమ కవితా వైదుష్యానికి తగిన ఠీవి ప్రకటిస్తున్నారట.

పత్రికా విలేకరి అక్కడ ఇంకో విచిత్రమైన విషయం కనిపెట్టాడట. అక్కడ వున్న సాహిత్యవేత్తలందరూ సదస్సులు జరుపుతున్నారట. వారిలో ఇటీవలి తరాలవారు కొందరు "మీ రచనలు చాలా పాతపడిపోయాయి. వాటిని పరిష్కరించి ఈ కాలానికి తగినట్లుగా చెయ్యాలి" అని ఒక తీర్మానం పెట్టారట.

ప్రాచీనులు దాన్ని అంగీకరించారట ఏకగ్రీవంగా. భూలోకానికి తమ ప్రతినిధులను పంపి అలా చేయడమే అక్కడే వాటిని తాము పరిష్కరించి నూతన ప్రతులు భూలోకానికి పంపడమా! అనేదింకా తేలలేదట.

పత్రికా విలేఖరికి రవీంద్రులు చాణుక్యుని పరిచయం చేశారట. అక్కడ అనేకమంది సంస్కృత పండితులు పధ్నాలుగో శతాబ్దం నుంచి ఇరవయ్యో శతాబ్దం వరకూ, చెందిన వారున్నారు. వీరిలో చాలామంది జర్మనీ, తిరుపతి, బాత్‌పురాలకు చెందిన ఉద్ధండులున్నారుట.

పత్రికా ప్రతినిధి చాణుక్యుని దర్శించాడట. ఆయన మాత్రం తొణక్కుండా అలాగే నిలబడి వున్నాడట. విలేఖరి చెప్పాడట. "అయ్యా! విద్య జీవితంలో ఎక్కువ ఉపయోగం లేకుండా పోయింది. మీరు విద్యావంతుణ్ణి చక్రవర్తికి మించిన స్థానంలో ఉంచారు. కానీ ఈరోజుల్లో చక్రవర్తి కాదుగదా! సర్వసామాన్యమైన ఒక కమిటీ సభ్యుని ముందు కూడా విద్యావంతుడు నిలబడలేకపోతున్నాడంటే మీరు కోప్పడవద్దు. ఇప్పుడు ప్రజలు జీవించేది విద్యతో కాదు. వట్టి చాకచక్యంతో, పొగడ్తలతో వీటివల్లనే విజయాలు సంపాదిస్తున్నారు. అఖండ కీర్తి గడిస్తున్నారు. అందరిచేత 'అహా' అనిపించుకుంటున్నారు."

"చాణుక్య మహాశయా! వింటున్నారా? కనుక మీరు దయవుంచి "విద్యాత్తమ్నస్పదంచా" అనే వాక్యాన్ని మీ శ్లోకంలోనుంచి కొట్టి వేసుకోవడం మంచిది. లోకం మారినా పాత శ్లోకాలు అలా పెట్టుకు కూర్చుంటే వచ్చే లాభమేమిటి?"

ఇది విని చాణుక్యుడు జావకారిపోయాడట. ఎంతవాడైతే మాత్రం ఏం చేస్తాడు. ఆ కాలంలో పూజింపబడ్డాడు. మహారాజుల్ని కూడా చదరంగంలో పావుల్లాగా కదిలించి, ఆట ఆడాడు. కాలం మారిందని చెపితే కళ్ళు పెద్దవి చేసుకుని చూశాడు తప్ప ఏం చెప్పగలడు? పత్రికా విలేకరి చాణుక్యుణ్ణి హడలగొట్టి వేశాడు.

విలేఖరి అక్కడనుంచి మెల్లగా మారి కొంతముందుకు సాగాడట. అక్కడొక పండితోత్తముడు కనిపించాడు. విలేఖరి ఎరుగున్న ముఖంలాగా కనిపించింది.

కొంచెం ఆలోచించి "ఆయన బాలాంతిక పదకోశకర్త రాజశేఖర్ బోస్ కాడూ. ఆయన్ని 'పరుశురామ్' అనికూడా అంటారు?" అని ప్రశ్నించాడట. అక్కడ ఉన్నవారు "అవును ఆయనే" అన్నారట. "అలాగే ఇక్కడున్నారా వారు? ఒక్కసారి పలకరించి వస్తాను. అలాంటి మహనీయుణ్ణి చూసి కూడా అవతలకు ఎలాపోను?" అన్నాడు విలేఖరి.

"వెళ్ళండి ఫర్వాలేదు. ఇది పదకోశకర్తల శాఖ. వీరందరినీ మేము పేర్లు పెట్టి పిలవడం ఆచారం లేదు. వారు సృష్టించిన పదకోశాల పేర్లతోనే వ్యవహరిస్తూ ఉంటారు. ఉదాహరణకు ఆక్సుఫర్డు, కేంబ్రిడ్జి. అదుగో ఆ ప్రక్క కనిపించేది - వెబ్‌స్టర్" అన్నాడు అక్కడగల ప్రతినిధి.

"ఏమిటి వీరంతా ఏదో కార్యక్రమంలో మునిగివున్నట్లున్నారు. ఇంతపేరు సంపాదించుకుని, హాయిగా ఇక్కడ చేరారుగదా! ఇంకా ఏమిటి వీరింత దీర్ఘాలోచనలో వున్నారు?" అని విలేఖరి ప్రశ్నించాడు.

"వారు తమ తమ పదకోశాల్ని పరిష్కరించుకుంటున్నారు" అని చెప్పాడు ప్రతినిధి.

"పదకోశాల్ని పరిష్కరించడమా? ఇదేం రాజ్యాంగ చట్టమా? విదేశాంగ నీతా?" అని విలేఖరి విస్తుపోయడట కొంతసేపు.

ఇంతలోనే ప్రక్కనున్న స్వర్గ సాహిత్య ప్రతినిధి పత్రికా విలేఖరిని 'ఛాంబర్సు' వద్దకు తీసుకుపోయి "ఇలా చూడండి. ఈ పెద్దమనిషి భూలోకంనుంచి ఇప్పుడే వచ్చాడు. పదకోశానికి సంబంధించిన సలహాలేమైనా వుంటే మీరు అడిగితెలుసుకోవచ్చు. తాజా సలహాలివ్వగలడు" అని పరిచయం చేశాడు.

ఛాంబర్సు విలేఖరి వంకకు తిరిగి "మహాశయా కొంచెం సలహా చెప్పండి. న్యాయం, ధర్మం, సత్ప్రవర్తన, నీతి, కరుణ ప్రేమ, అనురాగం, గౌరవం, నైతిక విలువలు, సచ్ఛీలం, సమర్ధత. ఈ మాటలవల్ల భూలోకంలో ఏమైనా ప్రయోజనం వున్నదా? వీటికి నేను పేర్కొన్న అర్ధాలింకా అమలులో వున్నాయా? ఇవన్నీ నిష్ప్రయోజనమై పనికిరాని పదాల క్రిందపడివున్నాయని విన్నాను. నిజమేనా?" అని ప్రశ్నించాడట.

పత్రికా విలేఖరి ఏం జవాబు చెప్పాలో తోచక అలాగే నిలబడిపోయాడుట. ఇంతలో "గ్రంధం సైజు తగ్గిస్తే ఎవరు కొంటారండీ?" అనే గొంతు వినిపించింది. ఎవరాయన అని ప్రశ్నిస్తే "పబ్లిషర్" అని అక్కడవాళ్ళు చెప్పారట.

తర్వాత పత్రికా విలేఖరి షేక్సుపియర్‌ను కలుసుకున్నాడు. ఆయనతో ఇలా చెప్పాడట. "మీరు మీ రచనలను ఎన్ని విధాలుగానన్నామార్చండి. కానీ ఒక్క వాక్యం మాత్రం మార్చవద్దు. దానికి ఎన్నోవేల పౌనుల విలువ వుంది. కాపిటలిజం, సోషలిజం, హ్యూమనిజం ఏదైనా రానివ్వండి, 'యిజం'లు లేనిచోట కానివ్వండి. ఢిల్లీ, పెకింగ్, లండన్, వాషింగ్‌టన్, మాస్కో ఎక్కడైనా కానివ్వండి చలామణి అయ్యే ఆ వాక్యాన్ని మాత్రం మీరు మార్చకండి" అని విలేకరి కోరాడు.

"మీకు జ్ఞాపకం వుంటే ఆ వాక్యమేమిటో చెపుతారా?" అని షేక్సుపియర్ అడిగాడు. "రేషన్, కంట్రోలు, ఇన్‌ఫ్లేషన్‌ల కాలంలో ఆ వాక్యాన్ని ఎవరు మరిచిపోతారు స్వామీ? "మతిభ్రష్టులు విందులు చేస్తారు. ధీమంతులు ఆరగిస్తారు" అని వ్రాశారు. మీకే జ్ఞాపకం లేదూ?" అన్నాడట విలేఖరి. ఆ మహారచయిత తనలో తాను నవ్వుకున్నాడట.

Post your comments